సాక్షి ఒడిశా

మంగళవారం । 30 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,53,099, బంగారం 900మిల్లీగ్రాములు, వెండి 9.2 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



సంబరాలకు శ్రీకారం..

- 8లో



నిధుల కేటాయింపుపై హర్షం

- 8లో

న్యూస్‌రీల్

గవర్నర్‌కు ఓపీఎస్సీ నివేదిక



ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఓపీఎస్సీ) చైర్మన్ డాక్టర్ సత్యజిత్ మహంతిరాజ్ రాజ్‌భవన్‌లో గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్‌తో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఓపీఎస్సీ 2022–2023 వార్షిక నివేదిక వార్షిక నివేదికను ఆయనకు అందజేశారు. – భువనేశ్వర్

కాలువలో కారు బోల్తా.. వ్యక్తి మృతి



తలోదొండొ కాలువలో పడిన కారు

భువనేశ్వర్: కటక్ ప్రాంతంలో సోమవారం ఘోర ప్రమాదం సంభవించింది. వంతెనపై పరుగులు తీయాల్సిన కారు అదుపు తప్పి తలోదొండొ కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో భర్త ఘటనా స్థలంలో మృతిచెందగా.. భార్య ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. మాతృభవన్, నయాబజార్ రోడ్డు మార్గంలో దూసుకు పోతున్న కారు అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గమనించిన స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసు దళం కలిసి ప్రమాదానికి గురైన కారులో చిక్కుకున్న ఇరువురినీ వెలికి తీశారు. సత్వర చికిత్స కోసం స్థానిక ఎస్‌సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కారు నడుపుతున్న వ్యక్తి మరణించినట్లు ప్రకటించారు. మృతుడు కందర్పూర్ ప్రాంతానికి చెందిన జ్ఞానేంద్ర జెనా, చికిత్స పొందుతున్న ఆయన భార్య అంజన జెనాగా గుర్తించారు.


గంజాయితో నిందితుడి అరెస్ట్



పట్టుబడిన గంజాయి, నిందితుడితో ఎక్సైజ్, రైల్వే పోలీసులు

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతంలో సదర్ పోలీసులు, రైల్వే సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఓ వ్యక్తి నుంచి 33.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఐఐసీ సీమాకిరణ్ బెక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో రాయగడ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గమనించారు. అతని వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా.. అందులో గంజాయి పట్టుబడింది. నిందితుడు హర్యాణా లోని రహత్ జిల్లాకు చెందిన మకర గ్రామవాసి దల్‌సర్ సింగ్ (34)గా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సమారు రూ3.3 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు.

సారాతో పట్టుబడిన నిందితులు



పట్టుబడిన సారా, నిందితులతో పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితిలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ సిబ్బంది సోమవారం అరెస్ట్ చేశారు. మత్తిలి కాలనీ సారా విక్రయస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ ఎస్ఐ బింబాధర్ పండా, సిబ్బంది దాడి చేశారు. ఈ మేరకు సుధకార్ కోపీ, కార్తీక్ పూజారి పట్టుబడగా, వారి నుంచి 28 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు.

సొంతింటి కల.. సాకారం



- రాష్ట్ర కేబినెట్ సమావేశంలో 18 ప్రతిపాదనలకు ఆమోదం
- వివరాలు వెల్లడించిన సీఎస్ చీఫ్ సెక్రటరీ ప్రదీప్ జెనా
- వీఎస్‌ఎస్‌యూటీకి రూ.2వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడి
- గజపతి, బొలంగీర్ జిల్లాలకు తాగునీటి ప్రాజెక్టులు

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మండలి సరికొత్త పథకం 'మో ఘురొ'(నా ఇల్లు) యోజనతో సహా 18 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో నిమ్న, నిమ్న మధ్య ఆదాయ కుటుంబాల సొంత ఇంటి కల సాకారం చేసేందుకు ఈ పథకం దోహదపడుతుంది. పేద వర్గాలు సొంత ఇల్లు కట్టుకునేందుకు మో ఘురొ పథకం కింద ఆర్థికసాయం అందుతుంది. ప్రస్తుతం కొనసాగుతున్న గృహ నిర్మాణ పథకంలో యోగ్యత లేని మినహాయింపు కుటుంబాలకు కొత్త పథకం ఊరట కలిగిస్తుంది. లబ్ధిదారుల అర్హత ప్రామాణికలు ఇతరేతర ఆంక్షల మినహాయింపుతో మో ఘురొ కింద పేదలకు ఇల్లు లభిస్తుంది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా సోమవారం వెల్లడించారు. గజపతి జిల్లాలో రెండు గ్రామీణ తాగునీటి సరఫరా ప్రాజెక్టులకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల వల్ల 346 గ్రామాలకు చెందిన 1.31లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. బొలంగీర్ జిల్లాలో 222 గ్రామాలకు చెందిన 1.61లక్షల మంది నివాసితులకు ప్రయోజనం చేకూర్చేందుకు 6 తాగునీటి ప్రాజెక్టులకు ఆమోదం లభించింది.

వైద్య బోధన విస్తృతం..

బుర్లా సురేంద్రసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ(వీఎస్‌ఎస్‌యూటీ) రూపాంతరం కోసం రూ.2వేల కోట్లతో సంస్థాగత అభివృద్ధి ప్రణాళికను అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ వ్యయంతో బుర్లా వీఎస్‌ఎస్‌యూటీలో బహుళ విభాగాల బోధన, పరిశోధనలకు ప్రోత్సాహానికి ఈ ప్రణాళిక ప్రాణం పోస్తుంది. మెడికల్ అండ్ అలైడ్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ రంగంలో రాణించేందుకు వీలుగా 'ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్' పేరుతో అనుబంధ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపారు. ఐదేళ్ల ప్రణాళిక కింద విశ్వవిద్యాలయం కార్యాచరణ ఇతరేతర అనుబంధ కార్యకలాపాల కోసం మంత్రివర్గం రూ.330.17 కోట్లను మంజూరు చేసింది.

జీఎస్‌టీ మినహాయింపు..

ఈ ఏడాది ఏప్రిల్ 5నుంచి జూన్ 30వరకు అమలులోకి వచ్చేలా ఇటీవల విడుదలైన హిందీ సినిమా 'జ్విగాటో' పన్ను (జీఎస్‌టీ)ని మినహాయించేందుకు సోమవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీర్మానించారు. ఇదే తరహాలో ఇటీవల విడుదలైన 'డెలివరీ బాయ్' ఒడియా చిత్రానికి ఏప్రిల్ 21నుంచి జూన్ 30వరకు జీఎస్‌టీ మినహాయింపునకు అంగీకారం లభించింది.





మంత్రిమండలి సమావేశ వివరాలను వెల్లడిస్తున్న సీఎస్ ప్రదీప్‌కుమార్ జెనా

మో ఘురొ పథకం ఆర్థిక సాయం, సబ్సిడీ వివరాలు

రుణ పరిమితి	జనరల్ లబ్ధిదారులకు	ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు
రూ.లక్ష	రూ.30 వేలు	రూ.40 వేలు
రూ.1.5 లక్షలు	రూ.45 వేలు	రూ.55 వేలు
రూ.2 లక్షలు	రూ.60 వేలు	రూ.70 వేలు
రూ.3 లక్షలు	రూ.60 వేలు	రూ.70 వేలు

కొనుగోలుదారుల సమస్యలకు తెర

అపార్ట్‌మెంట్ల మెరుగైన నిర్వహణ కోసం ఒడిశా అపార్ట్‌మెంట్(యాజమాన్యం, నిర్వహణ) ఆర్డినెన్స్–2023 ప్రకటనకు ఒడిశా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా తీసుకొచ్చిన కొత్త చట్టం అపార్ట్‌మెంట్ కొనుగోలుదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు ముగింపు పలుకుతుంది. అలాగే కొత్తగా లైబ్రరీ అటెండర్ పోస్ట్(ఉద్యోగం) ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. ఈ నేపథ్యంలో ఒడిశా(ప్రభుత్వేతర కళాశాలలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత సెకండరీ పాఠశాలలు) గ్రాంట్–ఇన్–ఎయిడ్ ఆర్డర్–2008కి సవరణలు చేశారు. 350కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న కళాశాలలో కొత్తగా లైబ్రరీ అటెండర్ భర్తీకి అనుమతి లభించింది.



కోణార్క్ శోభాయమానం..

ఒడిశా ప్రభుత్వం కోణార్క్ సూర్యదేవాలయం సముదాయం అభివృద్ధి చేయాలని మంత్రిమండలి సమావేశంలో నిర్ణయించింది. ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ మాన్యుమెంట్స్, టూరిస్ట్ డెస్టినేషన్ స్కీం కింద కోణార్క్ హెరిటేజ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్(కేహెచ్‌ఏడీపీ) ఆలయ సముదాయంలో, చుట్టుపక్కల భౌతిక మౌలిక సదుపాయాలను విస్తరించి సందర్శకులకు దీర్ఘకాల అనుభూతిని మిగిల్చే రీతిలో విస్తృతంగా అభివృద్ధి చేస్తారు 18 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు భారీగా రూ.209,73,70,000లు మంజూరుకు మంత్రిమండలి అంగీకరించడం విశేషం. భువనేశ్వర్ పాతబస్తీ ప్రాంతంలో వివిధ పురాతన స్మారక చిహ్నాల సంరక్షణ, పునరుద్ధరణ కోసం ఏకామ్ర క్షేత్ర సౌకర్యాలు, స్మారక చిహ్నాల పునరుద్ధరణ కార్యాచరణ ప్రణాళికకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్ట్ అమలు కోసం రూ.156 కోట్ల 21 లక్షలు మంజూరు చేశారు.

జిల్లాలో రెండు ఏకలవ్య పాఠశాలలు

- శంకుస్థాపన చేసిన కేంద్ర జలశక్తి, గిరిజన వ్యవహారాల మంత్రి బిశ్వేస్వర టుడు



ఏకలవ్య మోడల్ పాఠశాల నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి బిశ్వేస్వర టుడు

పర్లాకిమిడి: జిల్లాలోని మోహనా నియోజకవర్గం నువాగడ, రాయగడ సమితులలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మాణం కానున్నాయి. కానుంది. దీనికి సంబంధించి కేంద్ర జలశక్తి, గిరిజన వ్యవహారాల మంత్రి బిశ్వేస్వర టుడు సోమవారం శంకుస్థాపన చేశారు. జిల్లాలోని పర్యటించిన ఆయన... తొలుత పలాస నుంచి రైలులో నువాగడ చేరుకున్నారు. స్థానిక సమితిలోని తుబుకుల్ పంచాయతీ కుంజంగ్ గ్రామం, రాయఘడ సమితి సుభద్రానగర్‌లో ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే జలార్‌సింగ్ గ్రామంలో సవర సమాజం కల్యాణ సమితి నాయకులు దివంగత పవన్ పుజారియా గమాంగ్ పేరిట స్మృతి మందిరం, శిలావిగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏడీఎం రాజేంద్ర మింజ్,డ మోహనా ఎమ్మెల్యే దాశరథి గమాంగో, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భృగుభక్షి పాత్రొ, కాశీనగర్ సమితి మాజీ అధ్యక్షుడు ఛిత్రి సింహాద్రి, మాజీ అధ్యక్షుడు సిద్ధేశ్వర మిశ్రా, యువమోర్చా నాయకులు బాలకృష్ణ మహాపాత్రొ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోడ్డు మార్గంలో కంధమాల్ జిల్లా బల్లిగుడ, జి.ఉదయగిరికి పయనమయ్యారు.

యాత్రకు సన్నాహకం



సమీక్షలో మాట్లాడుతున్న డీజీపీ సునీల్‌కుమార్ బన్సాల్

- పూరీ రథయాత్రపై డీజీపీ సునీల్ బన్సాల్ సమీక్ష
- పక్కా ఏర్పాట్లతో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి పిలుపు

భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్ర సమీపిస్తోంది. విభాగాల వారీగా యాత్ర నిర్వహణకు యంత్రాంగం సిద్ధం అవుతోంది. జూన్ 20న పూరీలో జరగనున్న చతుర్థామూర్తుల రథయాత్ర దృష్ట్యా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) సునీల్‌కుమార్ బన్సాల్ సీనియర్ అధికారులతో కటక్ లోని కార్యాలయంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథయాత్ర సందర్భంగా జగన్నాథ ఆలయ సంప్రదాయం ప్రకారం వేర్వేరు తేదీల్లో వివిధ పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. యాత్ర షెడ్యూల్ ప్రకారం జూన్ 19న నవయవ్వన దర్శనం, 20న రథయాత్ర, 28న బహుడా(మారు యాత్ర), 29న స్వర్ణ అలంకారం, జూలై 1న నీలాద్రి విజే వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది యాత్రికులు, భక్తులు పూరీకి తరలి వస్తారని గుర్తు చేశారు. యాత్ర ఆద్యంతాలు సజావుగా నిర్వహించడంలో అధికారులు చురుగ్గా వ్యవహరించి, నిత్యం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై వివరణాత్మక చర్చ జరిగిన అనంతరం శాంతి భద్రతల కార్యాచరణ ఖరారు చేశారు. అలాగే అధికారులు, బలగాల వసతి సదుపాయాలకు సంబంధించి సమీక్షించారు.

సమీక్షలో ప్రధానాంశాలు..

- నవయవ్వన దర్శనం, గుండిచాయాత్ర, బహుడా, స్వర్ణ అలంకారం తదితర ప్రధాన కార్యక్రమాలైన రథోత్సవాల సందర్భంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు.
- అదనపు భద్రతా కార్యకలాపాలకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్(ర్యాఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) దళాలను ముందస్తుగా మోహరిస్తారు.
- సీనియర్ పోలీసు అధికారులకు నిర్దిష్ట విధుల కేటాయింపు.
- బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, హెచ్‌హెచ్‌ఎండీ, డీఎంఎఫ్‌డీలు, మెటల్ డిటెక్టర్లు అందుబాటులో ఉంటాయి.
- కౌంటర్ ఇంటెలిజెన్స్ స్క్వాడ్‌ల మోహరింపు.
- వీవీఐపీల భద్రత.
- కమ్యూనికేషన్ ఏర్పాట్లు, వివిధ మార్గాలను కేటాయించే సమగ్ర ప్రణాళిక/ఏర్పాట్ల తయారీ.
- క్రేన్లు, వాహనాలు, ఇతర అనుబంధ యంత్రాల ఏర్పాటు.
- సీసీటీవీ కెమెరాల ఏర్పాటు.
- రోడ్డు డివైడర్, డెలినేటర్, ట్రాఫిక్ ఎన్‌క్లోజర్ల ఏర్పాటు.
- బీచ్ పెట్రోలింగ్ బలోపేతం చేయడం.
- బస్ ఆపరేటర్లకు సంబంధించిన సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ.
- తాత్కాలిక పోలీస్ ఎయిడ్ పోస్టుల ఏర్పాటు.
- ట్రాఫిక్ నియంత్రణ.

ముగిసిన దివ్యాంగ శిబిరం

- పలువురు లబ్ధిదారులకు ఉపకరణాలు అందించిన అధికారులు



వినికిడి యంత్రం పంపిణీ చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి రాణిపేట పంచాయతీలో జిల్లా న్యాయసలహా ప్రాధికరణ సంస్థ ఆధ్వర్యంలో న్యాయమూర్తి ప్రణబ్‌కుమార్ రౌత్రాయ్ ఆదేశాల మేరకు గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం సోమవారం ముగిసింది. దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన ఇందిరాగాంధీ జాతీయ వార్ధక్య పింఛన్, దివ్యాంగ భృతి, మధుబాబు వార్ధక్య పింఛన్, ఉపాధి కల్పన, బీం భాయి భృతి, బిజూ స్వాస్థ్య కల్యాణ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసలహా ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా, బీడీఓ కపిలేశ్వర తండి, సర్పంచ్ పిన్నింటి అరుణ, బ్లాక్ సామాజిక సురక్షా అధికారి కె.సీతారాం తదితరులు దివ్యాంగుల ఇంటింటికి వెళ్లి, వారిని పరామర్శించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉచిత న్యాయసలహా అందిస్తామని తెలిపారు. అలాగే ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, చేతికర్రలు, వినికిడి యంత్రాలు, స్మార్ట్ కేన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమర్థ్ దివ్యాంగుల సంస్థ అధ్యక్షుడు సంతోష్ మహారాణా, నిరంజన్ బెహరా, సీసీడీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అడ్డాల జగన్నాథరాజు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి రబినారాయణ బెహరా



రాయగడ: దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన దృశ్యం

కొలనారలో ట్రై సైకిళ్ల పంపిణీ..

రాయగడ: జిల్లా న్యాయసహాయ సంస్థ ఆధ్వర్యంలో కొలనార ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి నివేదిత పెండా ముగ్గురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, మరికొందరికి ఉపకరణాలు పంపిణీ చేశారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరంతో దివ్యాంగులకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. కొలనారలో జరిగిన వితరణ కార్యక్రమంలో జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారి శ్రీకాంత్ కుమార్ పాణిగ్రహి, ప్రభాత్‌కుమార్ సబర్, జేకే పేపర్‌మిల్ పీఆర్‌ఓ స్మృతిరేఖా కర్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ నెక్కంటి సుడిగాలి పర్యటన

- బురదలమ్మ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేత



క్రికెట్ టోర్నమెంట్ విజేత జట్టుకు ట్రోఫీ, చెక్ అందిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్, కొలనార సమితుల్లో రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. సమితిలోని భుజబల్ ఖెదాపడ, మునిసింగి, కల్యాణ సింగుపూర్‌లోని జగన్నాథపూర్, నారాయణపూర్, సికరపాయి, రేవతిగుడ ప్రాంతాల్లో పర్యటించారు. మునిసింగిలో బురదలమ్మ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని, విజేతగా నిలిచిన బుదుని జట్టుకు రూ.15 వేల నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. రన్నరప్ బురిజిగుడ జట్టుకు రూ.10 వేల నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గెలుపోటములపై కాకుండా ఉన్నత లక్ష్యంపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం నారయణపూర్‌లో నూతనంగా నిర్మించిన హనుమాన్ మందిర ప్రతిష్ఠోత్సవాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భుజబల్, ఖెదాపడ, సికరపాయి ప్రాంతాల్లో నిర్వహిస్తున్న అమ్మవార్ల పండగలో పాల్గొని, ప్రజలతో మమేకమయ్యారు.



సికరపాయిలో పర్యటిస్తున్న మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు

అడుగడుగునా నీరాజనాలు..

నెక్కంటి పర్యటనలో భాగంగా ఆయన పర్యటించిన గ్రామాల్లో మహిళలు సాదరంగా ఆహ్వానించారు. నుదుట తిలకం దిద్ది, ఆశీర్వదించారు. సికరపాయిలోని కొన్ని వీధుల్లో తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా.. త్వరలో వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పర్యటనలో ఆయన తనయుడు కృష్ణచైతన్య, బీజేడీ సీనియర్ నాయకులు చంద్రకాంత్ సామల్, బి.తిరుపతిరావు, ముచ్చి శ్రీనివాసరావు, దూడల శ్రీనివాసరావు తదితరలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరోగ్యవీధిలో నీలమ్మ సంబరాలు



సన్నాయి నాయుడు వీధిలో అమ్మవారి సంబరాలు

పర్లాకిమిడి: పట్టణంలోని 8వ వార్డు ఆరోగ్య వీధి, సన్నాయి నాయుడు వీధిలో గ్రామదేవత నీలమ్మ అమ్మవారి సంబరాలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగి ఈ సంబరాల్లో విద్యుత్ దీపాల అలంకరణ, విచిత్ర వేషాధారణతో యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు నీళ్లతో చల్లదనం చేశారు. మంగళవారంతో సంబరాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

చెట్టెక్కి బెదిరించిన యువకుడు



చెట్టు పైనుంచి యువకుడిని దించుకున్న అగ్నిమాపక బృందం

భువనేశ్వర్: స్థానిక లోయర్ పీఎంజీ కూడలిలో సోమవారం మధ్యాహ్నం ఓ యువకుడు చెట్టు పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో పరిసరాల్లో గందరగోళం నెలకొంది. మద్యం మత్తులో ఉన్న యువకుడు నగరంలోని రద్దీ ఉండే ప్రాంతంలో చెట్టు ఎక్కాడు. చెట్టుకు టవల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం మొదలుపెట్టాడు. స్థానిక టీవీ ఛానల్ తన పేరును వివాదంలో ఇరికించి, ప్రతిష్టను దిగజార్చడంతో ఈ విధంగా నిర్ణయించుకున్నానని తీవ్ర మనస్తాపం వ్యక్తం చేశాడు. కొద్దిసేపటికే అక్కడ గుమిగూడిన స్థానికులు కిందకుదించే ప్రయత్నం చేశారు. జనసందోహం పెరగడంతో రాష్ట్ర అసెంబ్లీ మార్గంలో రవాణాకు అంతరాయం ఏర్పడి, దారి పొడవునా వాహనాలు స్తంభించిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. బుజ్జగించినా యువకుడు కిందకు దిగి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది చెట్టు ఎక్కి, సురక్షితంగా కిందకు దించారు. అనంతరం రాజధాని ఆస్పత్రిలో చేర్చారు. మానసిక క్షోభకు గురై ఈ అఘాయిత్యానికి విఫలయత్నం చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు భావిస్తున్నారు.

నేడు బొడ్డేపల్లి విగ్రహావిష్కరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం మూడు గంటలకు శ్రీకాకుళం కొత్త రోడ్డు జంక్షన్ దగ్గర ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌లతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం శ్రీకాకుళం శాంతి కన్వెన్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

పాలిసెట్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలిసెట్-2023 ధ్రువీకరణ పత్రాలు పరిశీలన సోమవారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. మొదటి రోజు సోమవారం మొదటి ర్యాంకు నుంచి 12,000 మధ్య ర్యాంకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఈ పరిశీలనకు జిల్లా నుంచి 275 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఓసీ, బీసీ విద్యార్థులు 262 మంది, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 13 మంది ఉన్నారు. 12001 నుంచి 28000 మధ్య ర్యాంకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు మంగళవారం పరిశీలిస్తారు. కౌన్సెలింగ్ ప్రక్రియను కౌన్సెలింగ్ కోఆర్డినేటర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు, ఇన్‌చార్జి మురళీ కృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమం

- మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలని జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నగర పాలక సంస్థ, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రీసోర్సు పర్సన్లకు వారం రోజుల నుంచి శిక్షణ కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న పీడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు పట్టణాల్లో 51,000 మంది స్వయం సహాయ సంఘాల మహిళలు ఉన్నారని చెప్పారు. మన ప్రభుత్వం, మన సంక్షేమం, మన అభివృద్ధి అనే నినాదంతో అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నట్లు వివరించారు.

సంబరాలకు శ్రీకారం..



అమ్మవారికి హారతిస్తున్న పూజారి



పట్టణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణ



ఊరేగింపులో పాల్గొన్న నెక్కంటి, పట్టణ ప్రముఖులు

- ఘనంగా ప్రారంభమైన బురదల పోలమ్మ ఉత్సవాలు
- అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానించిన పుర ప్రముఖులు

రాయగడ: గ్రామదేవత బురదల పోలమ్మ అమ్మవారిని సంబరాలు జరిపించేందుకు పుర ప్రముఖులు సోమవారం రాత్రి ఆహ్వానించడంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. 9రోజుల జరిగే ఈ ఉత్సవాలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణ ప్రముఖులు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, శిల్లా జగన్నాథరావు, డాక్టర్ కృష్ణమోహన్ కుమంధాన్, బార్జి ప్రసాద్‌నాయుడు తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి మందిరం వద్ద ప్రత్యేక హారతి ఇచ్చిన పూజారులు.. అనంతరం మెయిన్ రోడ్డు వద్ద ఉత్సవాల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి ఊరేగింపు ప్రారంభించారు. మేళ తాళాలు, ఆదివాసీ డప్పులతో స్థానిక జిల్లా ట్రెజరీ వరకు చేరుకున్న ఊరేగింపులో భాగంగా ఘటాలకు పూజలు నిర్వహించి వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం కుమ్మరి వద్ద ప్రత్యేకంగా రూపొందించిన బండారమ్మ ఘటాన్ని కూడా తీసుకువచ్చి అమ్మవారి సన్నిధిలో నిలిపారు.

పాదాలు తీసుకువచ్చుట..

ఉత్సవాల ప్రారంభానికి ప్రధాన ఘట్టమైన అమ్మవారి పాదాలను స్థానిక భైరవీధిలోని దొరల ఇంటి నుంచి తీసుకువచ్చారు. అమ్మవారి కన్నవారైన దొరల ఇంటి నుంచి అమ్మవారికి సంబరాలు జరిపిస్తామని ఆహ్వానించారు. అక్కడ నుంచి అన్నదమ్ముడైన దువ్వేర పోతన మందిరానికి వెళ్లి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి పాదాలను మెయిన్ రోడ్డు వద్ద తాత్కాలికంగా నిర్మించే షెడ్డులో నిలపడంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

కన్నవారి ఇంటి నుంచి

కన్నవారి ఇంటి నుండి సంబరాలు జరిపించుకునేందుకు వెళ్లిన అమ్మవారికి ఆమె కన్నవారు (దొరలు) ఇంటి నుండి మొదటి భోగాన్ని సోమవారం రాత్రి సమర్పించారు. ప్రతీ ఏడాదిగా వస్తున్న ఈ ఆచారాన్ని , పద్ధతుల ప్రకారం ఈ ఏడాది కూడా పూజకార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

విద్యుత్ అలంకరణలు..

ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు శోభయమానంగా ఉన్నాయి. విద్యుత్ వెలుగుల్లో పట్టణంలో పండుగ శోభ కనిపించింది. అదే విధంగా బాణసంచాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఊరేగింపులో వందల మంది ప్రజలు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న యువత, ప్రజలు



బాణసంచా వెలుగులు

చోరీ సొత్తు రికవరీ



పోగొట్టుకున్న బైక్ తిరిగి పొందిన ఆనందంలో బాధితుడు వెంకటరమణ

- బాధితులకు సామగ్రి అందజేసిన పోలీసులు



లలిత భొత్రకు గృహోపకరణాలు అందిస్తున్న పోలీసులు

జయపురం: సబ్ డివిజన్ పరిధిలో గత కొంతకాలంగా చోటు చేసుకుంటున్న దొంగతనాలకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు చోరీ సొత్తును రికవర చేయడంతో పాటు వాటిని బాధితులకు అప్పగించారు. దీనికి సంబంధించిన వివరాలను బొరిగుమ్మ పోలీసు స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌డీపీఓ మధుశ్మిత మిశ్రా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022, 2023 లలో బొరిగుమ్మ పోలీసు స్టేషన్ పరిధిలో మోటార్ పంపులు, విద్యుత్ జనరేటర్లు, మోటారు బైక్, సెల్ ఫోన్లు, ఇతర సామగ్రి అపహరణకు సంబంధించి కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిపై దర్యాప్తు చేపట్టి, 8మంది నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో చందన ఖొర, దుర్జన్ హరిజన్, సురు గొండ్, లోకనాథ్ నాయక్, కేశవ భొత్ర, భీమ భొత్ర, జొగేష్ భొత్ర, నవ భొత్ర ఉన్నారని వెల్లడించారు. నిందితుల నుంచి చోరీ సొత్తు రికవరీ చేశామన్నారు. ఈ మేరకు ఫిర్యాదుదారులకు సమాచారం అందించి, వారి సామగ్రి గుర్తించడంతో పాటు తిరిగి అప్పగించామని వివరించారు. పోగొట్టుకున్న వస్తువులు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. సమావేశంలో బొరిగుమ్మ పోలీసు అధికారి ఖరేశ్వర సాహు, అదనపు పోలీసు అధికారి డొంబు పొరజ, ఏఎస్ఐ పద్మచరణ నాయక్, ఎస్ఐ రచిత మడకామి, హవాల్దార్ సత్యరంజన నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శబరి సుకన్య ప్రతిభా పోటీలు

- ఆదివాసీ సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్న కళాకారులు



వేదికపై పోటీలను తిలకిస్తున్న అతిథులు, నిర్వాహకులు

జయపురం: స్థానిక పట్టణానికి చెందిన తరుణ ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ గంధార్‌పాల్ నువాగుడ గ్రామంలో శబరి సుకన్య ప్రతిభా సమ్మాన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గంగాధర నందో మాట్లాడుతూ ప్రాచీన ఆదివాసీ సంస్కృతి, కళల పరిక్షణ లక్ష్యంతోనే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాశ్చాత్య సంప్రదాయాలకు తలొగ్గకుండా భారతీయ సంప్రదాయాలకు ప్రాధాన్యం కల్పించాలనేదే ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆదివాసీ పరిశోధకులు రాజేంద్ర పాఢి, పొరజ సమాజ్ అధ్యక్షుడు లయిచన్ మాఝి, నాయక్ సర్పంచ్ గుప్త కుమార్, తరుణ ప్రజ్ఞాభారతి కార్యదర్శి యజ్ఞేశ్వర పండా, సహాయ కార్యదర్శి లక్ష్మీకాంత మిశ్రా, సుభాష్‌చంద్ర పండా, రామశంకర షొడంగి, రవీంద్ర మహరాణ, సబిత త్రిపాఠి, మమాని దాస్, సువర్ణ ఛీలా, లిపిక దొలాయి, కులమణి జెనా తదితరులు మాట్లాడారు. పోటీల్లో నువాగుడ, రామగిరి, కుంద్రా ప్రాంతాల నుంచి పొరజ, భూమియ, ఆదివాసీ సంప్రదాయ కళాకారుల బృందాలు పాల్గొని, తమ ఆట, పాటలతో ఆకట్టుకున్నారు. విజేతలకు సంస్థ వార్షికోత్సవం సందర్భంగా సన్మానిస్తామని డాక్టర్ నందో ప్రకటించారు.



పోటీల్లో పొరజ కళాకారుల ప్రదర్శన



విజేతలుగా నిలిచిన భూమియ కళాకారుల బృందం

‘స్పందన వినతులు పరిష్కరించండి’



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన వినతులు నాణ్యమైన రీతిలో పరిష్కరించాలని, సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఉప కలెక్టర్ జయదేవి, ప్రకత్యేక ఉప కలెక్టర్ మురళీ కష్ణ, కలసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. ప్రతి దరఖాస్తును 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించడమా లేదా తిరస్కరించడమా అనే అంశాలపై వివరణ ఇవ్వాలని సూచించారు. నేటికి 21 రీ ఓపెన్ ఉన్నాయని వాటిని వేగవంతంగా నాణ్యతా ప్రమాణాలతో పరిష్కరించాలన్నారు. స్పందన దరఖాస్తుల పరిష్కార విధానంపై ప్రతి వారం జిల్లా ఆడిట్ టీం ద్వారా ఆడిట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణాధికారి వెంకట్రామన్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా వైద్య ఆరోగ్యం అధికారి బి.మీనాక్షి, డీఎస్‌ఓ వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

2న మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో సుమారు 16 స్థానిక, బహుళజాతి ప్రైవే ట్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని, ఈ సదవకాశాన్ని పదో తగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఉప కలెక్టర్ జయదేవి, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీకృష్ణ, ఉప కలెక్టర్ జి.జయదేవి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా రెండో రోజు ఏపీ పీజీఈసెట్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న పోస్టు గ్రాడ్యుయేషన్ ఇంజినీరింగ్, ఫార్మసీ ప్రవేశాలకు సంబంధించిన ఏపీ పీజీ ఈసెట్ రెండో రోజు సోమ వారం సజావుగా ముగిసింది. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతుండగా, మొదటి షిఫ్టులో 83 కి 74, రెండో షిఫ్టులో 72కి 63 మంది హాజరయ్యారు.

నిధుల కేటాయింపుపై హర్షం

- గుమ్మా, రాయఘడ తాగునీటి పథకాలకు రూ.379.18 కోట్లు మంజూరు చేసిన రాష్ట్రప్రభుత్వం



విలేకర్లతో మాట్లాడుతున్న తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో తాగునీటి పథకాలకు రాష్ట్రప్రభుత్వం రూ.379.18 కోట్ల నిధులు కేటాయించింది. సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, జిల్లా బీజేడీ నాయకులు తిరుపతి పాణిగ్రాహి తదితరులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు పర్లాకిమిడిలోని పీడబ్ల్యూడీ బంగ్లా విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణంతో పర్లాకిమిడి నియోజకవర్గం గుమ్మా బ్లాక్‌లో 16 గ్రామ పంచాయతీల పరిధి 156 గ్రామాల్లని లక్షా 31వేల 733 మంది ప్రజలకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. మోహానా నియోజకవర్గం రాయఘడ సమితి 21 పంచాయతీల్లో 190 గ్రామాల్లోని 72,756 మందికి పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందించవచ్చని వెల్లడించారు. అంతేకాక కృష్ణసాగరం, రామసాగరం పుణరుద్ధరణకు కూడా రాష్ట్ర 5టీ కార్యదర్శి పాండ్యన్ నిధులు గతంలోనే మంజూరు చేశారన్నారు. ఈ తాగునీటి పథకాల పనులు రానున్న 24 నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభివృద్ధి మండలి చైర్మన్ మరియం రైతో, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ, గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండళ్, రాయఘడ సమితి అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, బీజేడీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్ నాయక్ తదితరులు సీఎం నవీన్ పట్నాయక్, 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్, ఎమ్మెల్యే ప్రణబ్‌ప్రకాష్ దాస్, రాష్ట్ర సహకార సంఘాల శాఖామంత్రి అతాను సవ్యసాచి నాయక్, ఎంపీ చంద్రశేఖర సాహు లకు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు, బీజేడీ నాయకులు

13 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతులు

అరసవల్లి: పంచాయతీ రాజ్ శాఖలో విస్తరణాధికారులు (ఈఓపీఆర్డీ)గా, మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ అధికారులు (ఏఓ)గా పనిచేస్తున్న సీనియర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 93 మంది ఈఓపీఆర్‌డీలు, 112 మంది ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు లభించాయి. ఈ క్రమంలో జిల్లాలో ఐదుగురు ఈఓపీఆర్‌డీలకు, 8 మంది ఏఓలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓ)గా పదోన్నతులు లభించాయి. జిల్లాలో వివిధ మండలాల్లో ఈఓపీఆర్డీలుగా పనిచేస్తున్న ఈశ్వరరావు, రాజేశ్వరరావు, రవికుమార్, హరిహరరావులకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ.. పొరుగు జిల్లాలకు పోస్టింగులను కేటాయించగా, కోటబొమ్మాళి మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న కె.నిశ్చలకు స్థానిక జిల్లాలోనే ప దోన్నతి కల్పించారు. అలాగే స్థానిక జెడ్పీ మేనేజ్‌మెంట్‌లో ఏఓలుగా పనిచేస్తున్న ఎం.రవీంద్రబాబు, వి.తిరుమలరావులకు కూడా ఇదే జిల్లాలో విధులు కేటాయించారు. అలాగే జిల్లాలోని వివిధ మండలాల్లో ఏఓలుగా పనిచేస్తున్న ఎం. మన్మధరావు, జి.జయంత్ ప్రసాద్, కె.అప్పలనాయుడు, జి.కాశీ విశ్వనాథరావు, కె.వసంత్‌కుమార్, యు.కుమార్ పట్నాయక్‌లకు పొరుగు జిల్లాల్లో మండలాలకు ఎంపీడీఓలుగా కేటాయించగా, ఇతర జిల్లాల నుంచి కొత్తగా ఎంపీడీఓల పదోన్నతులతో ఎల్‌వీ అప్పారావు, ఎస్.రమణయ్య, సీహెచ్ ప్రేమలీల, కె.ఉషశ్రీ, ఆర్‌వీ రమణమూర్తి, టి.రమాదేవి, జె.ఉమామహేశ్వరి, జి.శివప్రసాద్, ఎన్.హనుమంతరావు, జి.చంద్రరావు తదితరులు ఇక్కడకు రానున్నారు.



జిల్లా పరిషత్ కార్యాలయం

ఇచ్చిన ఆప్షన్ల మేరకు జిల్లాల కేటాయింపు



ఎంపీడీఓలుగా జిల్లాకు చెందిన పలువురు మండల సీనియర్ అధికారులకు పదోన్నతులు లభించాయి. ఈ మేరకు పదోన్నతులు పొందిన వారి నుంచే మూడు ఆప్షన్లు తీసుకుని జిల్లాలను కేటాయించారు. ఈ ప్రకారం కొత్త విధుల్లోకి చేరాల్సి ఉంటుంది. అలాగే జిల్లాకు ఎంపీడీఓలుగా కేటాయించిన వారికి త్వరలోనే మండలాలను కేటాయించనున్నాం.

– ఆర్.వెంకట్‌రామన్, సీఈఓ, జిల్లా పరిషత్

కారుణ్య నియామక పత్రాల అందజేత

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిబద్ధత, అంకిత భా వంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం పలువురికి కారుణ్య నియామక పత్రాలను జేసీ ఎం.నవీన్‌తో కలిసి అందజేశారు. పలు శాఖల్లో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు 39 మందికి ఈ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఉప కలెక్టర్ జయదేవి, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీ కష్ణ, ఉప కలెక్టర్ జి. జయదేవి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు పాల్గొన్నారు.



ఉద్యోగ నియామక పత్రాలతో అభ్యర్థులు

క్లుప్తంగా

కెంగువలో గడ్డివాములు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గజపతినగరం రూరల్(బొండపల్లి): మండలంలోని కెంగువ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు రైతులకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు గ్రామానికి చెందిన గుడివాడ పాపినాయుడు, అచ్చింనాయుడు, వెంకన్నలకు చెందిన గడ్డి వాములు ప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియ రాలేదు. ప్రమాద విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. రూ.30 వేల వరకు నష్టం ఉంటుందని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు. నష్టం 30 వేల వరకు ఉంటుందని స్థానిక అగ్ని మాపక అధికారులు తెలిపారు.

గంజాయి పట్టివేత


పోలీసులకు పట్టుబడ్డ గంజాయి

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద పోలీసులు 210 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాలు.. సోమవారం రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద కారును వదిలి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు వెళ్లిపోయారు. పోలీసులు కారును తనిఖీ చేయగా 210 కేజీలు ఉన్నట్లు గుర్తించారు. కారును, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

మహేశ్వరి హత్యతో వెలుగు చూస్తున్న ఆర్థిక అక్రమాలు

- కళ్లేపల్లి గ్రామంలో వైఎస్సార్ క్రాంతి పథం అధికారుల విచారణ
- బ్యాంకు అధికారులను గ్రామంలోకి రప్పించాలని మహిళల డిమాండ్


వెలుగు అధికారులతో వాగ్వాదం చేస్తున్న కళ్లేపల్లి మహిళలు

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామైక్య సంఘం బుక్ కీపర్ గోకేడ మహేశ్వరి హత్యకేసులో అదే గ్రామానికి చెందిన మరో బుక్ కీపర్ గాడి చిన్నతల్లి జైలుపాలైన విషయం పాఠకులకు తెలిసిందే. మహేశ్వరి హత్యతో గ్రామానికి చెందిన మహిళా సంఘాలకు రుణాల మంజూరులో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. స్త్రీనిధి ఏజీఎం ఎ.ఉమామహేశ్వరరావు, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ ఎం.జయశ్రీ తదితరులు సోమవారం విచారణ జరిపారు. అప్పటి వెలుగు సీసీ ఈశ్వరరావు, కొత్తవలస ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ సహాయంతో మహిళా సంఘాలకు మంజూరైన రుణాలను చిన్నతల్లి పక్కదారి పట్టించిందంటూ మహిళలు ఆరోపించారు. రమాబాయి, అంబేడ్కర్, బీమాభాయ్, ధనలక్ష్మి, వికాస్, తారకరామా తదితర గ్రూపులకు చెందిన డబ్బులను సొంత అవసరాలకు వాడుకుందన్నారు. మహిళా సంఘాల మహిళల పేరిట బుక్‌కీపర్ చిన్నతల్లే బ్యాంకు నుంచి రుణాలు తీసుకొని మళ్లీ బ్యాంకుకు వాయిదాలు చెల్లిస్తున్నట్టు గుర్తించారు. బ్యాంకు మేనేజర్, అప్పటి వెలుగు సీసీలను గ్రామంలోకి రప్పించి విచారణ చేయాలని మహిళలు ఆందోళనకు దిగారు. గ్రామపెద్దలు సర్దిచెప్పి విచారణకు సహకరించాలని సూచించారు.

ఎపిడిమాలజిస్టు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఐడీఎస్‌పీలో ఎపిడిమాలజిస్టు పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకునేందుకు విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

మార్కెటింగ్‌శాఖ ఏడీ శ్యామ్ కుమార్‌కు బదిలీ

- ఆయన స్థానంలో గంగాధర్ నియామకం

విజయనగరం ఫోర్ట్: మార్కెటింగ్ శాఖ ఏడీ ఎ.శ్యామ్‌కుమార్‌కు గుంటూరు జిల్లాకు బదిలీ అయింది. ఆయన స్థానంలో శ్రీకాకుళం మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గంగాధర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురు సూపర్‌వైజర్లకు కూడా బదిలీ అయ్యింది.

మినీ గోకులాలకు పునర్జీవం

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పాడి రైతులు మినీ గోకులాలు నిర్మించగా బిల్లుల చెల్లింపులు జరగలేదు. దీన్ని గుర్తించిన ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీటికి బిల్లులు చెల్లించి పాడి రైతులకు అండగా నిలవాలని నిర్ణయించింది. దీంతో మినీ గోకులాలకు క్షేత్ర స్థాయిలో కొలతలు వేస్తున్నారు. సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత సంబంధిత బిల్లులు రైతుల బ్యాంకు ఖాతాలకే జమ కానున్నాయి.



మినీ గోకులానికి కొలతలు వేస్తున్న ఉపాధి సిబ్బంది

- గత ప్రభుత్వంలో నిలిచిన బిల్లులు
- బిల్లులు చెల్లింపునకు ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- పాడి రైతుల్లో సంతోషం

రాజాం సిటీ:

రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తూ.. పంటల సాగు, పాడి పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పాడి, పంట రైతులకు రెండు కళ్లలాంటివి. అటువంటి రైతులను గత ప్రభుత్వం మోసం చేస్తే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకునేందుకు ముందుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. గత ప్రభుత్వ హయాంలో మోసపోయిన రైతులను ఆదుకునేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులు నిర్మించుకున్న గోకులాలు, మినీ గోకులాలకు బిల్లులు చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం మినీ గోకులాలు, గోకులాలు బిల్లులు చెల్లించకుండా రైతులను మోసం చేసింది. ఈ నేపథ్యంలో అన్నదాతలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే మినీ గోకులాలు, గోకులాల నిర్మాణాలకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి క్షేత్ర స్థాయిలో ఉపాధి హామీ సిబ్బంది, పశు సంవర్ధక శాఖ అధికారులు పరిశీలించి వాటిని అప్‌లోడ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

గోకులాల పేరుతో టీడీపీ మోసం

దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ 90 శాతం సబ్సిడీతో మినీ గోకులాలు మంజూరు చేస్తామని గత టీడీపీ ప్రభుత్వం నమ్మబలికి నిరాశకు గురి చేసింది. 2018, 2019 సంవత్సరాల్లో మినీ గోకులాలు, గోకులాలు నిర్మించుకుంటే 90 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రచారం చేసి 10 శాతం వాటా కింద రైతులచే నగదు కట్టించింది. నిర్మాణాలు పూర్తి చేస్తే బిల్లులు ఇస్తామని మెలిక పెట్టింది. రాయితీ వస్తుందని రైతులు అప్పులు చేసి గోకులాలు, మినీ గోకులాలు ఎలాగోలా నిర్మాణాలు పూర్తి చేశారు. తరువాత నిర్మాణాలు పూర్తి చేసిన రైతులెవరికీ టీడీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా జాప్యం చేసింది. దీంతో బిల్లుల కోసం ఎదురుచూసిన రైతులంతా తీవ్ర నిరాశకు గురయ్యారు.


బిల్లులు జమ కానున్న మినీ గోకులాలు

201 మంది రైతులకు రూ.1.68 కోట్లు లబ్ధి

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 201 మంది రైతులు మినీ గోకులాల నిర్మాణం చేపట్టారు. వీరందరికీ రూ.1.68 కోట్లు మేర లబ్ధి చేకూర్చనుంది. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేయడంతో బిల్లుల కోసం ఎదురుచూపులే మిగిలాయి. అటువంటి రైతులందరికీ బిల్లులు చెల్లించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్మాణాలు జరిగినప్పటికీ బిల్లులు చెల్లింపులు జరిపేందుకు ఉపాధి హామీ ద్వారా ఆయా రైతుల వివరాలు, షెడ్ల నిర్మాణాల స్థితిగతులను తెలుసుకుని అప్‌లోడ్ చేయిస్తున్నారు.

అప్పట్లో ఇలా..

గత టీడీపీ ప్రభుత్వంలో 20 పశువులకు గోకులం, 2, 4, 6 పశువులు ఉంటే మిని గోకులం మంజూరు చేసింది. మినీ గోకులానికి రూ. 90వేలు, రూ.1.40 లక్షలు, రూ.1.70 లక్షల చొప్పున మంజూరుకు ప్రణాళికలు వేసింది. దరఖాస్తు చేసుకున్న రైతులందరి నుంచి 10 శాతం వాటాగా డీడీలు తీయించి మిగిలిన మొత్తం సబ్సిడీగా అకౌంట్‌లలో జమ చేస్తామని నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలో 201 మంది రైతులు మినీ గోకులాల నిర్మాణాలను అప్పట్లో పూర్తి చేశారు. తరువాత ఈ నిర్మాణాలకు సంబంధించి బిల్లులు ఇవ్వకుండా చేతులెత్తేసింది. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ బిల్లులను చెల్లించేలా చర్యలు చేపడుతుంది. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పశుసంవర్ధక, డ్వామా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంది. పరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేలా డ్వామా అధికారులు ఇప్పటికే క్షేత్ర స్థాయి సిబ్బందితో ముమ్మర చర్యలు చేపట్టారు.

ప్రక్రియ మొదలు పెట్టాం..



జిల్లాలో 201 మంది రైతుల మినీ గోకులాల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో అనుమతులు వచ్చాయి. వీరంతా పది శాతం వాటా ధనం కూడా చెల్లించి నిర్మాణాలు పూర్తి చేశారు. బిల్లులు చెల్లింపులు మాత్రం జరగలేదు. ప్రస్తుతం అటువంటి రైతులందరికీ బిల్లులు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్షేత్ర స్థాయిలో ఉపాధి సిబ్బందిచే నిర్మాణాలకు సంబంధించి పరిశీలన ప్రక్రియ చేపడుతున్నాం. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. ఇప్పటికే 145 మంది రైతులకు సంబంధించి డేటాను అప్‌లోడ్ చేశాం. అనంతరం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకే నగదు జమకానుంది.

– జి.ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ, విజయనగరం

సమస్యలకు సంతృప్తికర పరిష్కారం చూపాలి

- ఇన్‌చార్జ్ జేసీ విష్ణుచరణ్


వినతులను స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ విష్ణుచరణ్

పార్వతీపురం: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వచ్చే అర్జీదారుల వినతులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం దిగువ సెల్లార్ హాల్ నందు సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఆయనతో పాటు డీఆర్‌ఓ జె.వెంకటరావు ప్రజల నుండి వినతులు స్వీకరించారు. జగన్నకు చెబుదాం కార్యక్రమంలో 200 వినతులు రాగా వీటిలో అధిక శాతం భూ సమస్యలు, పెన్షన్ అర్జీలు అందాయి.

అర్జీలు ఇలా...

పార్వతీపురం మన్యం జిల్లాలో 13 కేజీబీవీ పాఠశాలలో పని చేస్తున్న గెస్ట్ సీఆర్‌టీ, పీజీటీలను ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసే విధంగా నియమించాలని కోరుతూ పలువురు సీఆర్‌టీలు, పీజీటీలు వినతిపత్రాన్ని అందించారు. పాచిపెంట మండలం గొట్టురు గ్రామ పంచాయతీలో మాతుమూరు జంక్షన్ నుండి కుడుమూరు, కన్నయవలస, వేటగానివలసకు వెళ్లే రహదారి పూర్తిగా పాడై రాకపోకలు ఇబ్బందిగా ఉందని బీటీ రోడ్ మరమ్మతులను చేపట్టాలని గ్రామ సర్పంచ్ యం.సింహాచలం, గ్రామస్తులు అర్జీ అందజేశారు. పాచిపెంట మండలం పాచిపంట గ్రామంలో ఎస్సీ కాలనీలో బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనాన్ని కూల్చివేశారని, తిరిగి నిర్మించాలని ఎస్సీ కాలనీ వాసులు కోరారు. పార్వతీపురం మండలం లక్షణందొరవలస గ్రామంలో గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, సర్వే నంబరు 27/3, 5, 6, 7లో 106 ఎకరాల భూమికి సాగు హక్కు, పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. కురుపాం మండలం నాగరగూడలో రహదారి నిర్మించాలని సర్పంచ్ బి.రాజయ్యతో పాటు స్థానికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథం, నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామ చంద్రరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, డీఈఓ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 34 ఫిర్యాదులు


పార్వతీపురం టౌన్: అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 34 ఫిర్యాదులను బాధితుల నుంచి స్వీకరించినట్టు ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఫిర్యాదులను స్వీకరించిన ఆమె వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి ఏడు రోజుల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలను తనకు నివేదించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎస్‌బీ సీఐ జి.రాంబాబు, ఇ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్ఐ వాసుదేవ్ పాల్గొన్నారు.

గడువులోగా పరిష్కరించాలి : ఎస్పీ

పార్వతీపురం టౌన్: స్పందన వినతులను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతీ వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసు అధికారులు తమ తమ పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను అందజేయాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్, దిశా డీఎస్పీ ఎస్ఆర్ హరిత, ఏఆర్‌డీఎస్పీ బి.నాగేశ్వరరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ ప్రభాకర్, ఎస్ఐ పి.దినకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మానసిక రోగి మృతి

లక్కవరపుకోట : మండలంలోని నర్సంపేట గ్రామ సమీపంలో గల నేల బావిలో మానసిక రోగి సిమ్మ ఈశ్వరరావు ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ముకుందరావు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... కొత్తవలస మండలంల రామలింగాపురం గ్రామానికి చెందిన సిమ్మ ఈశ్వరరావుకు ఎల్.కోట మండలం నీలకంఠాపుం గ్రామానికి చెందిన బంగారమ్మతో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. కొద్ది నెలలుగా ఈశ్వరరావు మానసిక పరిస్థితి బాగోలేదు. ఈ క్రమంలో భార్య బంగారమ్మ ఆస్పత్రిలో చూపిస్తోంది. ఈ తరుణంలో మూడు నెలల కిందట ఈశ్వరరావును తీసుకొని తన కన్నవారి గ్రామం నీలకంఠాపురం వచ్చేశారు. కాగా శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ఈశ్వరరావు ఎంతకీ తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికారు. చివరకు సోమవారం ఉదయం నర్సంపేట గ్రామ సమీపంలోని గొర్లె దేముడుకు చెందిన వ్యవసాయ బావిలో ఈశ్వరరావు(65) మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి భార్య బంగారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


ఈశ్వరరావు (ఫైల్)

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- మద్య నిషేధ, అబ్కారీ శాఖ అధికారి సుధీర్

విజయనగరం క్రైమ్: మద్యం అక్రమ సరఫరాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా మద్య నిషేధ, అబ్కారీ శాఖ అధికారి వి.సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 142 ప్రభుత్వ రిటైల్ అవుట్‌లెట్స్, 24 టూరిజం ఫెసిలిటేషన్ సెంటర్స్, రెండు వాక్ ఇన్ షాపులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఏజెన్సీల ప్రకారం సిబ్బందిని నియమించామని తెలిపారు. నిరంతరం కానిస్టేబుల్ స్థాయి నుంచి డిపో మేనేజర్ స్థాయి వరకూ నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఎంఆర్‌పీ ఉల్లంఘనపై 15 కేసులు, అమ్మకం మొత్తంలో అవకతవకలపై 138 కేసులు నమోదు చేసి రూ.19లక్షల 73వేల 520 రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.

మహిళా రెజ్లర్లకు మద్దతు


మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య ప్రతినిధులు

శృంగవరపుకోట: దేశానికి పతకాలు సాధించిన మహిళారెజ్లర్ల ఆందోళనను ప్రధానమంత్రి మోదీ పట్టించుకోకపోవడంపై ఏపీ మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు మద్ది మాణిక్యం ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక విలేకర్లతో ఆమె సోమవారం మాట్లాడారు. పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా మహిళల మహాపంచాయితీ పేరుతో ఆందోళనకు సిద్ధమైన రెజ్లర్లను అదుపులోకి తీసుకునే క్రమంలో ఢిల్లీ పోలీసులు వారిని ఈడ్చుకెళ్లి బస్సులో పడేయడాన్ని తప్పుబట్టారు. దేశానికి పతకాలు సాధించిన క్రీడాకారులను అవమానించి, ఎంపీ బ్రిజ్‌భూషణకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడం విచారకరమన్నారు.

ఇది దేశానికే నష్టమని పేర్కొన్నారు. ఇప్పటికైనా బిజేపీ పెద్దలు పంతానికి పోకుండా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టుచేసి దేశప్రతిష్టను ఇనుమడింపజేయాలని మహిళాసమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ చాంద్‌బీబీ, ఎ.పార్వతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

మడ్డువలస పనులు షురూ...!

ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న వేళ మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో పనులు ముమ్మరం చేశారు. 31 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్‌లో సాగునీరు సమృద్ధిగా అందించేందుకు అధికారులు తమ వంతు కృషి చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా అవసరమైన మేరకు నిధులు విడుదల చేయడంతో పనులు వేగవంతమయ్యాయి.


గేట్లుకు రోప్స్ ఏర్పాటు


- ప్రాజెక్టులో నీటిని ఖాళీ చేయడంతో ఊపందుకుంటున్న పనులు

వంగర: మండల పరిధిలోని మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది మండలాల్లో 31వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీటిని అందించే ప్రాజెక్టు ఇది. ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు వివిధ రకాల పనులకు గతంలో రూ.3.70 కోట్లు మంజూరు చేయగా సుమారు రూ.40 లక్షలతో జంగిల్ క్లియరెన్స్, నిర్వహణ పనులు వంటివి పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం మరో రూ.1.80 కోట్లతో జరుగుతున్న పనులు ఊపందుకున్నాయి. ఇటీవల ప్రాజెక్టులో నిల్వ చేసిన నీటిని పూర్తిగా కిందకు విడిచిపెట్టడంతో ప్రాజెక్టు వద్ద నీటి మట్టం డెడ్ స్టోరేజీ(57.40) మీటర్ల లెవెల్‌కు అడుగంటిపోయింది. దీంతో ప్రాజెక్టు వద్ద బకెట్ పోర్షన్‌లో గేట్లుకు రబ్బర్ సీల్స్, కొత్త రోప్స్ ఏర్పాటు, బ్రిడ్జి పెయింటింగ్ వంటి పనులు జరుగుతున్నాయి. సాంకేతికపరమైన పనులను సకాలంలో చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

ఖరీఫ్ దృష్టిలో ఉంచుకొని పనులు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టు అధికారులు పనులను ముమ్మరం చేస్తున్నారు. ప్రాజెక్టులో ఉన్న నీటిని కిందకు విడిచిపెట్టడంలో కొంత ఆలస్యం అయినప్పటికీ పనులు నిర్వహణ కోసం కాంట్రాక్టరు సకాలంలో ముందుకు రాకపోవడంతో ఒకింత ఆలస్యానికి కారణమైంది. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తుందని, పనులు వేగంగా జరగకపోవడంతో ఈ ఏడాది ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు వస్తాయని ఇటీవల మండల సమావేశంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ ప్రస్తావించారు.

అయితే పనులు ఇప్పుడిప్పుడే వేగం పెంచుతున్నామని, నదుల నుంచి ఇన్‌ఫ్లో వచ్చే సమయానికి పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు డీఈ నర్మదా పట్నాయక్ వెల్లడించారు.


మడ్డువలస ప్రాజెక్టు

డీఎస్సీ-98 ఉపాధ్యాయులకు శిక్షణ


ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

బొబ్బిలి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డీఎస్సీ-98 ఉపాధ్యాయులకు బొబ్బిలి త్రిపుల్‌ఎస్ డిగ్రీ కాలేజీలో శిక్షణ తరగతులను డిప్యూటీ డీఈఓ నల్ల తిరుపతినాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదురోజుల పాటు సాగే శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలుచేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.